సృజన 136

# బొంబాయి బట్టలమిల్లు కార్మికుల సమ్మె

ఫిబ్రవరి 1983

కె. బాలగోపాల్

[జనవరి 18, 1982న మొదలయిన బొంబాయి నగరపు బట్టల మిల్లులలో సుదీర్ఘమయిన సమ్మె జరుగుతోంది. ఆ సమ్మెను గురించి వివిధ పత్రికలు రాసాయి, రాస్తున్నాయి. ఈ మధ్యనే బొంబాయి నగరంలోని కొందరు పత్రికారచయితలు, మేధావులు కలిసి Bombay's Historic Textile Strike అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఆ పుస్తకం మీద, ఇతరత్రా లభించిన సమాచారం మీద, ఆధారపడి రాసిన వ్యాసం ఇది]

## I

అది 1908 సంవత్సరం. జూన్ - జూలై నెలలు. దేశంలో మూడేళ్ళుగా స్వదేశీ ఉద్యమం నడుస్తోంది. కాంగ్రెస్ పిలుపిచ్చిన విదేశీవస్తు బహిష్కరణ మాత్రమే కాకుండ, బూర్జువా చరిత్రకారుల కళ్ళకు కనబడని ప్రజాఉద్యమాలు ఎన్నో ఆ మూడేళ్ళలో నడిచాయి. అహమ్మదాబాద్‌లో బట్టలమిల్లుల కార్మికులు, బొంబాయిలో పోస్టల్‌సిబ్బంది, తూర్పున అసాన్సోల్‌లో మొదలయి అలహాబాద్ దాకా రైల్వే కార్మికులు, ఆ కాలంలో మహత్తరమయిన సమ్మెపోరాటాలు చేసారు. ఒక సంవత్సరం పూర్వం, 1907లో, కాంగ్రెస్‌పార్టీ సూరత్ సమావేశంలో, అధికార చరిత్రకారుల పరిభాషలో మితవాదులు బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించాలనీ, విదేశీవస్తు బహిష్కరణ విరమించాలనీ, హింసామార్గం కూడదనీ, వాదించారు. అతివాదులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మిలిటెంట్ ఉద్యమం నడపాలని కాంక్షించారు. సామాజిక దృక్పథంలో ఇద్దరికీ పెద్దగా తేడాలేదు. ఒకరికి రక్తంలో వేడితక్కువ, ఇంకొకరికి వేడికొంచెం ఎక్కువ, అంతమాత్రమే.

ఈ వేడిరక్తపు జాతీయనాయకులలో బాలగంగాధర్ తిలక్ ముఖ్యుడు. ఒక్క మిలిటెన్సీ మినహాయిస్తే తిలక్‌ది చాలా తిరోగామి దృక్పథం. జాతీయతత్వాన్ని మేల్కొలపడానికి తిలక్ హిందూ సాంస్కృతిక చిహ్నాలను విరివిగా వాడుకున్నాడు. గోరక్షణ సంఘం ఒకటి ఏర్పాటుచేసాడు. గణపతి ఉత్సవాన్ని ఒక సాంస్కృతిక రాజకీయ వేడుకగా ప్రవేశపెట్టాడు. తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి మొగల్ బాద్‌షాతో యుద్ధం చేసి శివాజీని జాతీయ నాయకుడిగా నిలబెట్టి శివాజీ జన్మదినాన్ని పెద్ద జాతరగా జరిపేఅలవాటు ప్రవేశపెట్టాడు. ఆ తంతుముదిరి తరువాతికాలంలో

గణపతి ఉత్సవం హిందూ మతోన్మాదానికీ, శివసేన పుట్టిన తరువాత శివాజీ జన్మ దినోత్సవం మరాఠా కులతత్వానికీ వేదికలయ్యాయి.

ఏదయితేనేం, కాంగ్రెస్‌లో తొలిసారిగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించా లనీ, వాటికోసం ఏదో ఒక రూపంలో ప్రజలలోకి పోవాలనీ ప్రతిపాదించి ఆ ప్రతి పాదనను అమలుచేసినవాడు తిలక్. తానున్నది బొంబాయినగరం కాబట్టి ప్రజలలోకి పోవడం అంటే బొంబాయి నగరంలోని పెటీబూర్జువా వర్గంలోకీ, అప్పటికే రెండు లక్షలసంఖ్య అందుకున్న పారిశ్రామిక కార్మికులలోకీ, పోవడం. ఆ రెండు లక్ష లలో ఒక లక్షమంది బట్టల మిల్లులలో పనిచేస్తున్నారు. తిలక్ అనుచరులు ఈ బట్టలమిల్లుల కార్మికులలో జాతీయభావాలు ప్రచారంచేస్తూ, వాళ్ళసమస్యలమీద కది లించడం గూడ మొదలుపెట్టారు. తిలక్ దృక్పథంలోని తిరోగామి తత్వానికి సుకో మల్ సేన్ ఈ ప్రచారం నుండి కొన్ని ఉదాహరణలు ఇస్తాడు. సమ్మెకు పిలుపిస్తూ తిలక్ అనుచరులు వేసిన పోస్టర్లలో ఒకటి : 'పనిలోకి పోయినవాడు విదేశీయుడికో లేక పాకీవాడికో పుట్టినట్టులెక్క'. ఇంకొకటి ; 'పనిలోకి పోతే గోవును చంపి నంత పాపం'.

ప్రజలలోకి ఏరూపంలో పోతేనేం, ప్రజలలోకి పోతున్నారంటేనే చాలు, పాలకవర్గాలకు దడపుట్టడానికి. 1907 సూరత్ సమావేశం జరిగి ఒక సంవత్సరం తిరిగీ తిరగకముందే 1908 జూన్ 24న తిలక్‌ను అరెస్టుచేసారు. ప్రభుత్వాన్ని కూలదోస్తున్నాడనే నేరం (Sedition) కింద కేసుబనాయించి జులై 13న విచారణ ప్రారంభించి జులై 22న ముగించి బొంబాయి హైకోర్టు తిలక్‌ను 6 సంవత్సరాలు కారాగారశిక్ష వేసింది. ఆ నెలరోజులలో బొంబాయి కార్మికవర్గం తన మొట్టమొదటి రాజకీయ సమ్మె జరిపింది. అందులో సంఖ్యరీత్యా సగమువున బట్టలమిల్లుల కార్మి కులు ప్రముఖంగా పాల్గొన్నారు.

తిలక్ వాళ్ళ యూనియన్ నాయకుడు కాడు. అసలు ఆనాటికి వాళ్ళకు యూని యన్‌లు లేవు. కాని తమలో జాతీయ చైతన్యం మేల్కొలిపిన జాతీయనాయకుడిగా వాళ్లు తిలక్‌ను గుర్తించారు. తిలక్‌పై విచారణ మొదలయినరోజున, అంటే జులై 13న, గ్రీవ్స్‌కాటన్ అండ్ కంపెనీ మిల్లు కార్మికులు తమపనిముట్లను పక్కకుపెట్టి హైకోర్టుకు నడిచారు. అంతకుముందే (అంటే తిలక్ అరెస్టయిన నాటినుండీ) కార్మికుల అసంతృప్తికి గురయిన బ్రిటిష్ ప్రభుత్వం, రహదారులను సాయుధ

సైనికులతో కాపుకాయించింది. వాళ్ళతో ఘర్షణజరిగి కార్మికులు, కార్మికులతో
కలిపిన సామాన్యప్రజానీకం, దెబ్బలుతిన్నారు. తరువాతి రోజునుండి బ్రిటిష్
పాలకులు మిల్లు ప్రాంతాలను సైనికులతో చుట్టుముట్టి కార్మికులెవ్వరూ నగరంలోకి
రానివ్వకుండ చేయాలని చూసారు. జూలై 14, 15, 16 ఇట్లా గడిచాయి. 17న
ఒక్క గ్రీవ్స్‌కాటన్ అండ్ కంపెనీయే కాక, ఇంకా మరొక తొమ్మిది కంపెనీల
నుండి మొత్తం 20 వేలమంది కార్మికులు పారిశ్రామిక ప్రాంతమంతా తిరిగి ఇతర
కార్మికులను బయటకు రమ్మన్నారు. 18న గూడ అదే జరిగింది. ఫలితంగా జూలై
19న 60 మిల్లుల నుండి 65 వేలమంది కార్మికులు సమ్మెచేసారు. జీతంకోసం
కాదు, భత్యంకోసంకాదు, తిలక్‌పై దొంగ విచారణ ఆపాలని, జూలై 22న తిలక్‌కు
వేసిన శిక్షకు నిరసనగా 23న పూర్తిసమ్మె జరిపారు. ఒక లక్షమంది కార్మికులు
ఆనాడు సమ్మెలో పాల్గొన్నారు. వారికితోడుగా లక్షలాది మంది సామాన్య ప్రజా
నీకం హర్తాల్ చేసారు. తరువాతి రోజునుండి పోలీసులతో వీధులలోతలపడి తుపాకీ
లకు రాళ్లూ ఇటుకలూ ఎదురొడ్డి పోరాడారు. ఎంతమంది చనిపోయారో లెక్క తెలీదు.
ఈ పోరాటాన్ని గురించి దేశంలోని జాతీయనాయకులని పిలవబడే వాళ్లు ఏమను
కున్నారోగాని, రష్యా నుండి దీన్ని గమనించిన లెనిన్, 'భారతదేశంలో గూడ
కార్మికవర్గం చైతన్యవంతమయిన రాజకీయ ప్రజాపోరాట స్థాయిని అందుకుంటోంది.
ఇక ఇండియాలోని బ్రిటిష్ రాజ్యానికి కాలంచెల్లినట్టే'నన్నాడు.

## II

బ్రిటిష్ రాజ్యానికయితే కాలంచెల్లిందికానీ. సామ్రాజ్యవాదానికి ఇంకా ఈ
దేశంలో ఆయుస్సుమిగిలేవుంది. బొంబాయి బట్టల మిల్లుల కార్మికులు తమ మొట్ట
మొదటి రాజకీయ సమ్మెచేసి ఇవ్వాల్టికి 74సంవత్సరాలు గడిచాయి. సామ్రాజ్య
వాదం పట్టులో దేశమంతటిలాగే బొంబాయి బట్టల పరిశ్రమగూడ నత్తనడకనడుస్తోంది
1908 లోనే ఒక లక్షమంది కార్మికులున్న పరిశ్రమలో ఇవ్వాళ 2 నుండి 2½ లక్షల
వరకు మాత్రమేవున్నారు (దాదాపు 1 లక్షమంది ఏరోజుకారోజు పనితెచ్చుకునే
బదిలీ - తాత్కాలిక - కార్మికులు కావడాన నికరమయిన సంఖ్య ఇవ్వడం కష్టం).
ఈ సంఖ్యగూడ రెండవ ప్రపంచయుద్ధం చివర చేరుకున్నది. ఆ తరువాత దేశంలో
బట్టల పరిశ్రమ అంతగా అభివృద్ధిచెందలేదు. చెందినంతమేరకు చేనేత (handloom)
రంగంలోనూ, చిన్నచిన్న కార్ఖానాలు (Powerloom) రంగంలోనూ చెందింది. పెద్ద
పెద్ద మిల్లులలో పెరుగుదల కొంత వచ్చిందిగానీ, ముఖ్యంగా ఈ మధ్యకాలంలో

యంత్రీకరణ (mechanization) బలం పుంజుకోవడం వలన కార్మికుల సంఖ్య అంతగా పెరగలేదు. ఇకముందు క్రమంగా తగ్గిపోయే అవకాశం గూడ వుంది. ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టడం, కార్మికులలో కొంత మందిని పనినుండి తొలగించి, మిగిలినవారికి జీతాలు కొద్దిగా పెంచేఏర్పాటు యూనియన్లతో చేసుకోవడం రివాజయిపోయింది. ఈ తొలగింపు (retrenchment) కు వ్యతిరేకంగాను, ఇతరకోర్కెల సాధనకోసమూ బొంబాయి బట్టల మిల్లుల కార్మికులు పోరాటాలు చేయకుండ ఉండలేదు. 1928లో ఒకసారి 6 నెలలపాటు తొలగింపుకు వ్యతిరేకంగా సమ్మెచేసారు. 1929 తరువాత అంతర్జాతీయంగా వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభంలో బొంబాయి బట్టలమిల్లు కార్మికులు 10 వేలమంది ఉద్యోగాలు కోల్పోయారు. 1934లో ఒకసారి, 1938 లో ఒకసారి, తీవ్రమయిన సమ్మెలు చేసారు. 1940 లో డి. ఏ. కోసం 40 రోజులు సమ్మెచేసి సాధించుకున్నారు. 1950 లో బోనస్‌కోసం 67 రోజులు సమ్మెచేసి పోలీసు కాల్పులలో 12 మంది ప్రాణాలుకోల్పోయారు. 1974లో డాంగే నాయకత్వాన 42 రోజులు సమ్మెచేసారు. మళ్ళీ ఇవ్వాళ దత్తాసామంత్ నాయకత్వాన ఒక సంవత్సరకాలంగా అపూర్వమయిన పోరాటం చేస్తున్నారు. నిజానికి రైల్వే, జనపనారమిల్లు కార్మికులతోపాటు బట్టలమిల్లుల కార్మికులు జాతీయోద్యమ కాలంలో మిలిటెంట్ పోరాటాలను నడపడంలో అగ్రస్థానంలో ఉండేవారు.

పోరాటాలు నడపడమే కాదు, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి గ్రామాలలో నెలవుదొరికేదాకా బొంబాయి బట్టలమిల్లుల కార్మికులే ప్రముఖ స్థావరంగా వున్నారు, ఇవ్వాళ దత్తాసామంత్ భవిష్యత్తును నిర్ణయించే పోరాటాన్ని నడుపుతున్న కార్మికులే శ్రీపాద అమృత డాంగే గారికి ఒక భవిష్యత్తంటూ కల్పించారు - 1928 లో. 1928 ఏప్రిల్ 26న మొదలయి కార్మికుల తొలగింపుకు వ్యతిరేకంగా 6 నెలల పాటు నడిచిన ఒక మహత్తరమయిన సమ్మె క్రమంలోనే కమ్యూనిస్టుల మొట్ట మొదటిసంఘమయిన గిర్నీకాంగార్ యూనియన్ పుట్టింది. 1928 మే నెలలో 300 మంది సభ్యులతో పుట్టిన ఈ యూనియన్ సంవత్సరంచివరికి 50వేల మంది సభ్యులను సంపాదించుకుంది. డాంగే దాని మొట్టమొదటి కార్యదర్శి. డాంగే, మీరజ్‌కర్, రణదివె, ఎస్.వి. దేశ్‌పాండే ఎస్.జి. సర్దేశాయి, వీళ్ళంతా గిర్నీకాంగార్ యూనియన్ నుండి బలం సంపాదించుకున్న కమ్యూనిస్టు నాయకులే. మీరట్ కుట్రకేసు నిందితులలో ఏడుగురు గిర్నీ కాంగార్ సంఘం సభ్యులు. ఆనాటి డాంగే ఇవ్వాళ్ళ, ఒక సంవత్సరంగా సాగుతోన్న సమ్మె సందర్భంలో, మాట్లాడే అర్హత గూడ కోల్పోయా

దంటే తన సుదీర్ఘమయిన రాజకీయ పతనానికి దత్తా సామంత్ పౌరోహిత్యాన అంత్యక్రియలు జరిగినట్లు ప్రకటించుకోవడమే.

అయితే కమ్యూనిస్టుల ప్రాధాన్యాన్ని అంతంచేసే ప్రయత్నం దత్తాసామంత్ తో మొదలుకాలేదు. గిర్నీకాంగార్ యూనియన్ ఏర్పడి, AITUC లో ఒక ప్రాధాన్యమయిన సంస్థగా రూపొందిన నాటినుండీ బట్టలమిల్లుల కార్మికులను కమ్యూనిస్టుల నుండి రక్షించాలనే ప్రయత్నం చాలా తీవ్రంగాసాగింది. కాంగ్రెస్‌వారూ, 'సోషలిస్టులూ', రాయిస్టులూ కలిసి 1929 లో ఒకసారి, 1931 లో రెండవసారి, AITUC ని చీల్చినప్పుడు రెండుతడవలూ గిర్నీకాంగార్ యూనియన్ వివాదాంశాలలో ఒకటిగా వుండింది. AITUC చీలికతోపాటు గిర్నీకాంగార్ యూనియన్‌గూడ చీలి ఒకభాగం గిర్నీకాంగార్ యూనియన్ (లాల్‌బావుటా) అనే పేరుతో కమ్యూనిస్టులకు మిగిలింది.

కాని కాంగ్రెస్ వారు తమ కార్మికవ్యతిరేక చర్యలను AITUC ని చీల్చడానికి పరిమితం చేయలేదు. బ్రిటిష్ వలసరాజ్యం పరిధిలోనే తమకు పరిపాలనాధికారం చేజిక్కిన నాటినుండీ చట్టాలరూపంలో కార్మికులను అణచడానికి ప్రయత్నలోపం లేకుండ కృషిచేస్తూనే వచ్చారు. 1935 భారతప్రభుత్వ చట్టంక్రింద రాష్ట్రాలలో ఎన్నికలు జరిగి 'స్వదేశీ' ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అవి అధికారంలోవున్న 2½ సంవత్సరాలలో అవలంబించిన కార్మిక వ్యతిరేకపంథా స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌పాలన తీసుకోబోయేరూపాన్ని రుచిచూపించిందని సుకోమల్ సేన్ అంటాడు. బొంబాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మొట్ట మొదటిపని బొంబాయి పారిశ్రామిక వివాదాల చట్టాన్ని (Bombay Industrial Disputes Act, 1938) జారీచేయడం. 1946 లో మళ్ళీ రెండవసారి రాష్ట్రాలలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ 1938 చట్టాన్ని పునరుద్ధరిస్తూ బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టాన్ని (Bombay Industrial Relations Act, 1946) జారీచేసింది. ఇవాల్టి సమ్మె అప్రకటిత లక్ష్యాలలో ఒకటి ఈ చట్టాన్ని ఎత్తివేయించడం కాబట్టి దీన్నిగురించి తెలుసుకోవాలి.

ఒక ఫ్యాక్టరీలోగాని, పారిశ్రామిక రంగంలోగానీ కార్మికులకూ, యాజమాన్యానికీ తగాదా వచ్చినప్పుడు పరిష్కారానికి స్థూలంగా రెండు మార్గాలుంటాయి. ఒకటి కార్మికులూ యాజమాన్యమూ విషయాన్ని ముఖాముఖి తేల్చుకోవడం. కార్మికులు సమ్మెల ద్వారానూ, ఇతర పోరాట రూపాల ద్వారానూ యాజమాన్యం మీద ఒత్తిడి

తెచ్చి, చర్చలకుదించి తమకోర్కెలను ఏదో ఒక మేరకు సాధించుకుంటారు. రెండవమార్గం, పరిష్కారాన్ని చట్టం నియమించే పరిష్కార యంత్రాంగానికి వదిలిపెట్టడం. ఆ యంత్రాంగం లేబర్ ట్రిబ్యునల్ వంటిదయితే ఆ మార్గాన్ని adjudication అనీ, లేక ప్రభుత్వం తాత్కాలికంగా వేసే నిపుణుల/ పెద్ద మనుషుల కమిటీ అయితే arbitration అనీ అంటారు. మొదటి పద్ధతే కొంత మేరకయినా కార్మికుల అవసరాలను సాధించగలదని వేరే చెప్పనవసరం లేదు. ఎందుకంటే, ఒక పరిష్కారయంత్రాంగం వుంటే, దానితో పాటు సమ్మెనిషేధాలు ఉంటాయి. ఆ యంత్రాంగానికి వివాదాన్ని అప్పజెప్పిన తరువాత అది తన తీర్పు ఇచ్చేదాకా సమ్మె చేయకూడదన్న నియమం ఉంటుంది. తీర్పు ఇచ్చిన తరువాత అంగీకరించక తప్పదు కాబట్టి అసలు సమ్మెలనే నిషేధించడం దీని తాత్పర్యం. ప్రభుత్వాలు పారిశ్రామిక వివాదాల చట్టాలనీ, పారిశ్రామిక సంబంధాల చట్టాలనీ ఎప్పుడు ప్రవేశపెట్టినా వాటి ఉద్దేశ్యం ఇదే. వివాదాల పరిష్కారానికి ఒక నిర్బంధ పరిష్కార యంత్రాంగాన్ని నెలకొల్పడం, అన్ని వివాదాలనూ ఆ యంత్రాంగానికి రిఫర్ చేయాలనీ, దాని తీర్పును శిరసావహించాలనీ శాసనంచేయడం, తద్వారా సమ్మెలను నిషేధించడం- ఇదీ వాటి సారాంశం.

1946 బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టంలో (BIR Act, 1946) ఇవన్నీకాక మరొక అంశం గూడ ఉంది. అదేమిటంటే, వివాదాలలో కార్మికులకు ప్రాతినిధ్యం వహించే హక్కు గూడ అన్ని యూనియన్‌లకూ ఉండదు, ఒక్క 'గుర్తింపు పొందిన' (recognised) యూనియన్‌కు మాత్రమే ఉంటుంది. ఈ 'గుర్తింపు పొందడం' అన్నది నిజానికి గొప్ప బోగస్ నాటకం. వామపక్ష యూనియన్లు ముందు నుండీ గూడ, ఏ యూనియన్‌ను గుర్తించాలన్నది ఫ్యాక్టరీ కార్మికుల మెజారిటీ అభిప్రాయం మీద ఆధారపడి ఉండాలనీ, ఆ అభిప్రాయాన్ని రహస్య వోటింగ్ ద్వారా తెలుసుకోవాలనీ డిమాండ్ చేస్తూవస్తున్నాయి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం యూనియన్ల సభ్యత్వపు చందారశీదులనుబట్టి ఏ యూనియన్‌కు ఎంత మద్దతున్నదీ నిర్ణయిస్తుంది. ఈ 'గుర్తింపుపొందడం' అన్నది అన్ని చోట్లా వుంటుందిగాని, ఒకేఒక యూనియన్‌కు గుర్తింపుఇవ్వడం BIR చట్టం ప్రత్యేకత.

ఇంత పకడ్బందీగా కాంగ్రెస్ ప్రభుత్వం BIR చట్టాన్ని చేసిన తరువాత, తనకు అనుకూలమయిన యూనియన్ ఒక దానిని ఏర్పాటుచేసింది. నిజానికి ఇలాంటి

ఏర్పాట్లు బొంబాయి బట్టల మిల్లులకు మాత్రమే పరిమితంకాలేదు. 1940 ల దాకా ఇతరులతో కలిసి కార్మికరంగంలో పనిచేసిన కాంగ్రెస్‌పార్టీకి అధికారమార్పిడిదగ్గర పడేకొద్దీ తన స్వంత యూనియన్ల అవసరం తెలిసివచ్చింది. జాతీయోద్యమకాలంలో బూర్జువా వర్గానికి కార్మికవర్గానికి ఉండే సంబంధం వేరు, బూర్జువా వర్గానికి ఏమైన కయినా అధికారం చేజిక్కిన తరువాత ఉండే సంబంధం వేరు. జాతీయోద్యమ కాలంలో ఆ సంబంధంలో కొంత మిత్రత్వం ఉంటుంది. ఆ పిమ్మట మాత్రం కార్మికులచేత నయానా భయానా పనిచేయించడం వరకే ఆ సంబంధం పరిమితం. భయాన పనిచేయించడానికి పోలీసులూ, Industrial Security Force, వగైరాలు అవసరమయితే నయాన పనిచేయించడానికి తొత్తు యూనియన్లు కావాలి. అందుకే 1947 దగ్గరపడేకొద్దీ దేశవ్యాప్తంగా అన్ని పారిశ్రామిక రంగాలలోనూ కాంగ్రెస్ కార్మికసంఘాలు తయారయ్యాయి. వీటన్నిటి కలయికగా 1946లో INTUC ఏర్పాటయింది.

ఆరకంగా బొంబాయి బట్టలమిల్లుల్లో ఏర్పడింది రాష్ట్రీయ మిల్ మజ్దూర్ సంఘం (RMMS). ఇది 1945లో ఏర్పడింది. అప్పటినుండి ఇప్పటిదాకా బొంబాయి బట్టలమిల్లులలో 'గుర్తింపుపొందిన' ఏకైక యూనియన్‌గావుంది. గుర్తింపు' తరచుగా పునఃపరిశీలించబడదు కాబట్టి ఒకసారి గుర్తింపుపొందితే తొలగించడం కష్టం. సి.పి.ఐ., లాల్‌నిషాన్‌పార్టీ, మరొక మూడుపార్టీల యూనియన్లు కలిసి ఒకసారి కోర్టుకుపోయిగూడ ఆర్. ఎమ్. ఎమ్. ఎస్. ను గద్దెదించలేకపోయాయి.

యాజమాన్యానికి తొత్తుగా పనిచేయడం INTUC యూనియన్లకు కొత్త కాదుగాని, RMMS ఇందులో సాటిలేనిదనిపించుకుంది. ఫలితంగా, 1960 దాకా బొంబాయిలోని అన్ని పారిశ్రామికరంగాలలోకీ బట్టలమిల్లులలోనే వేతనాలు అధికంగా వుండేవికాగా, ఇప్పుడు ఇంజనీరింగ్, కెమికల్, వగయిరా రంగాలకార్మికులు బట్టల మిల్లుల కార్మికులకంటె 75 శాతంనుండి 100 శాతంవరకు ఎక్కువ సంపాదిస్తున్నారు. దీనికి ప్రధానమయిన కారణాలురెండు. ఒకటి, జీతంలో సాలుసరిఇంక్రిమెంట్లు (annual increments) ఉండవు. కాబట్టి ఎప్పుడయినా జీతంపెరిగితే ఇది పోరాటాల ఫలితంగానేతప్ప ఇతర కార్మికులకూ సిబ్బందికీ వచ్చినట్టు సీనియారిటీ పెరిగే కొద్దీ జీతంలోపెరుగుదలరాదు. అట్లాంటప్పుడు పోరాటంచేసే యూనియన్ లేకపోతే జీతంపెరుగుదల మందగించడం సహజం. రెండవది డి.ఏ. చాలాతక్కువగా

ఉండడం. ఇవ్వాళ దేశంలోని కార్మికసంఘాలన్నీ 100 శాతం neutralisation
కోసం ప్రయత్నిస్తున్నాయి. అంటే ధరలు రెండురెట్లయితే వేతనాలుగూడ రెండు
రెట్లుకావడమన్నమాట. ఇప్పటికే చాలారంగాలలో 60-70 శాతం neutralisation
సాధించారు. బొంబాయి బట్టలమిల్లు కార్మికులకుమాత్రం 40 శాతమే దక్కుతుంది.
అదిగూడ శాశ్వతఉద్యోగాలున్న కార్మికులకే, తాత్కాలిక (బదిలీ)కార్మికులకుకాదు.
మొత్తం కార్మికులసంఖ్యలో ఈబదిలీకార్మికులు 25 శాతం ఉన్నారని అధికారుల
అంచనా. 41 శాతమని అనధికారఅంచనా. అందులో సగంమంది పదిరెండేళ్ళ
పైగా పనిచేస్తున్నా పర్మనెంటుకాలేదు. వీళ్ళకు పనిదొరికిన రోజునకూలి 27 రూపా
యలుంటుంది గాని, నెలలో 15 రోజులుమించి పనిదొరకదు. కాబట్టి నెలసరి ఆదా
యం 400 రూపాయలు దాటదు. వేరే ఏ భత్యాలూ ఉండవు. ఈ మాత్రంకోసం
రోజూ మిల్లుగేట్లదగ్గర పడిగాపులుగాసి తమ 'అదృష్టం' పరీక్షించుకోవాలి.

ఫ్యాక్టరీలలో వాతావరణం చాలాఅనారోగ్యకరంగా వుంటుంది. పత్తిధూళి
వల్ల క్షయ, బ్రాంకైటిస్, వగైరారోగాలు వస్తాయి. ప్రతీనలుగురు కార్మికులలో
ఒకడు ఈ రకమయిన వ్యాధులతో బాధపడుతున్నారని ఇ. ఎస్. ఐ అంచనా. మగ్గాలు
నిరంతరాయంగా చేసే చప్పుడువలన చాలాకాలంపనిచేసే కార్మికులకు చెవుడురావడం
కద్దు.

యంత్రీకరణ మరొక ముఖ్యమయిన సమస్య. ముఖ్యంగా గత పదిసంవత్స
రాలుగా, యంత్రీకరణవల్ల కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడం, కోల్పోనివాళ్ళ
శ్రమభారం (work-load), ఉత్పాదకత (Productivity), చాలాపెరిగినా వేతనాలు
అందుకు సమంగా పెరగకపోవడం, ప్రధానమయిన సమస్యలుగా తయారయ్యాయి.
సమీపభవిష్యత్తులో ఈసమస్య చాలా తీవ్రతరం కాబోతుందనీ, ఇవ్వాళ్టిసమ్మె విజయ
వంత మయితేనే దాన్ని ఎదుర్కొనేశక్తి కార్మికులకుంటుందనీ, పరిశీలకుల భావన.

వీటన్నిటికన్నా అభ్యంతరకరమయినవి RMMS చెంగాగిరీ, దానిఆధిపత్యాన్ని
సంరక్షించే BIR చట్టం.

## *III*

ఇది చరిత్ర, పూర్వరంగం. 1981 అక్టోబరులో ప్రతీసంవత్సరం లాగే
బోనసగురించి వివాదంవచ్చింది. ప్రభుత్వం నిర్ణయించిన కనీసబోనస్ వేతనంలో
8.33 శాతం. కాని మామూలుగా యూనియన్-యాజమాన్యాల బలాబలాల్నిబట్టి 20

శాతంవరకు సంపాదించుకుంటారు కార్మికులు. ప్రత్యేక 'గుర్తింపు' పొందిన యూనియన్ RMMS కావడానా, అది యాజమాన్యపుతొత్తు కావడానా, ప్రతిసంవత్సరమూ సిపిఐ తదితర వామపక్షపార్టీల యూనియన్లు ఒత్తిడితెచ్చే RMMS చేత కొంచెం పెంచుబోనస్‌కే బేరంపెట్టించడం రివాజయింది బొంబాయి బట్టలమిల్లులలో. ఈ సంవత్సరమూ అట్లాగేఅయి, 8.33 నుండి 17.33 శాతంవరకు ఒక్కొక్కమిల్లు ఒక్కొక్కరేటుకు ఒప్పుకుంది.

కార్మికులు సంతృప్తిచెందలేదు. ఎమ్పైరిడైయింగ్ వంటి 15 మిల్లుల కార్మికులు ఒకరోజు హెచ్చరింపు సమ్మెచేసారు. తరువాతరోజుగూడ 8 మిల్లుల నుండి 25 వేలమంది కార్మికులు సమ్మెకొనసాగించాలని చూసారు. ఆ తరువాత రోజు స్టాండర్డ్ మిల్లుకార్మికులు ఒక వింతపనిచేసారు. 'గుర్తింపు'పొందిన RMMS నే కాక, సిపిఐవారి బొంబాయిగిర్నీకాంగార్ యూనియన్‌నూ, సిపిఐ(ఎం)వారి లాల్‌బావుటా గిర్నీకాంగార్ యూనియన్‌నూ, జార్జిఫెర్నాండెస్‌గారి గిర్నీ కాంగార్ సభనూ, లాల్‌నిషాన్‌పార్టీకి చెందిన కపడ్‌కాంగార్ సంఘటననూ, అన్నిటినీ కాదని, బొంబాయి కార్మికరంగపు సినీహీరోఅయిన దత్తాసామంత్ ఇంటికివెళ్ళారు. 37 సంవత్సరాలుగా తొత్తుయూనియన్ అయిన RMMS ను 'గుర్తింపు స్థానంనుండి తొలగించలేకపోవడం ప్రతిపక్షయూనియన్ల ప్రయత్నలోపంవల్ల కాకపోవచ్చు. ఈ కర్మభూమిలో INTUC కి తప్ప వేరేకార్మికసంఘానికి ప్రాతినిధ్యస్థానం లభించే అవకాశం లేకపోవచ్చు. అయినా కార్మికులు ప్రతిపక్షయూనియన్లను ('కమ్యూనిస్టు' యూనియన్లతోసహా) క్షమించదల్చుకోలేదు. తిన్నగా దత్తాసామంత్ ఇంటికివెళ్ళి, అంతవరకు అత్యధికంగా ఇంజనీరింగ్ కంపెనీలకు పరిమితమయివుండిన అతనిని తమకు నాయకత్వం వహించమని ఆహ్వానించారు.

దీనికొక కారణంవుంది. కార్మికులు రణదివేనీ, డాంగేనీకాదని దత్తాసామంత్ సమ్మోహనశక్తికి లోనయ్యారంటే అదివాళ్ళలో కార్మిక వర్గచైతన్యం లోపించడం వల్లకాదు. వేరేఒక బలమయిన కారణంవుంది. మొదట్లో అన్నట్లు, పారిశ్రామిక రంగంలో వివాదాల పరిష్కారానికి రెండుమార్గాలుంటాయి. ఒకటి పోరాటాలద్వారా, రెండు ప్రభుత్వంనెలకొల్పే నిర్బంధ పరిష్కార యంత్రాంగంద్వారా. బూర్జువా రాజ్యాంగం ఇచ్చేఅవకాశాలన్నింటినీ విప్లవంకోసం వాడుకోవాలనే తెలివిమాలిన ఎత్తుగడ చేపట్టినప్పటినుండీ రివిజనిస్టులు అన్ని బూర్జువాయూనియన్లలాగే ద్వైపాక్షిక సంప్రదింపుల సందర్భంలోనూ లేబర్‌కోర్టుల ఫైళ్ళలోనూ చిక్కుపడిపోయారు.

దత్తాసామంత్ దానికివిరుద్ధంగా ఆ యంత్రాంగాన్ని తిరస్కరించి దీర్ఘమయిన సమ్మెలద్వారా ఒత్తిడితెచ్చి యాజమాన్యంతో చర్చలుజరిపి సాధించుకోవడం అల వర్చుకున్నాడు. దీనివల్ల నష్టాలు జరగలేదనికాదు. జరిగాయి. ఈ పద్ధతి అన్ని పరి స్థితులలోనూ ఆచరణ సాధ్యమనిగూడకాదు. కాని తమపోరాటచైతన్యాన్ని ప్రాతిపది కగా చేసుకునే సామంత్‌ను కార్మికులు గౌరవించడం సహజం.

సామంత్ బట్టల పరిశ్రమరంగంలోకి దిగడానికి కొంత అయిష్టంగానే ఒప్పు కున్నాడు. ఆరోజు స్టాండర్డ్ మిల్లుతో మొదలుపెట్టి రోజుకొకమిల్లుదగ్గర గేట్ మీటిం గులు జరపాలని నిర్ణయించుకున్నారు. అయితే త్వరలోనే గేట్‌మీటింగులకు మిల్లు ఆవరణ చాలలేదు. కేవలం ఒకమిల్లుదగ్గర గేట్‌మీటింగ్‌కు 50 వేలమంది రావడం మొదలుపెట్టేసరికి రోజుకొక బహిరంగసభ అయింది. బోనస్‌తో ప్రారంభమయిన సమ్మె దీనితో తనపరిధిని విస్తరించుకుంది. వేతనాలలో గణనీయమయిన పెరుగుదల బదిలీకార్మికులకు శాశ్వతఉద్యోగం, ప్రముఖలక్ష్యాలయ్యాయి. RMMS ను తొల గించడం, BIR చట్టాన్ని ఎత్తివేయడం, అప్రకటిత లక్ష్యాలయ్యాయి. అప్రక టితమే అయినా, వాస్తవానికి RMMS పట్ల, BIR చట్టంపట్ల, 37 ఏళ్ళుగా కార్మి కులలో పేరుకుపోయిన తీవ్రమయిన అసంతృప్తిబద్దలుకావడమే ఈసమ్మెకుమూలం.

నిజానికి కార్మికుల పోరాటచైతన్యానికి దత్తాసామంత్ సినీహీరో ఇమేజీ గూడ చాలలేదు. అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి అయిన అంతులే, కార్మికుల సమ స్యలను పరిశీలించడానికి ముగ్గురుసభ్యుల కమిటీనొకదానిని వేయబోతున్నాననీ, ఆ కమిటీ రెండునెలలలో తననివేదికను సమర్పిస్తుందనీ, ప్రకటించాడు. సమ్మెచేస్తున్న ఎనిమిదిమిల్లుల కార్మికులు సమ్మెవిరమించాలని కోరాడు. దత్తాసామంత్ సమ్మె విరమణకు అంగీకరించలేదుగాని, కమిటీ తననివేదికను సమర్పించేదాకా ఎదురు చూడడానికీ ఒప్పుకున్నాడు. ఈ అంగీకారాన్ని లక్షన్నరమంది కార్మికులు హాజ రైన బహిరంగసభలో ప్రకటించాడు. కార్మికులలో చాలాఅసంతృప్తి కలిగించిన ఈ ప్రకటనవల్ల బట్టలమిల్లుల రంగంలో సామంత్‌జీవితం మూన్నాళ్ళముచ్చటగా ముగి సేదేగాని, మిల్లుయజమానులూ, RMMS నాయకులూ, ఆశిస్తే రక్షించారు. ఆ ఎనిమిది మిల్లులలో సమ్మెనుగూడ సామంత్ విరమించుకోలేదన్న సాకుచూపి వాళ్లు ప్రభుత్వం వేయబోయేకమిటీతో సహకరింప నిరాకరించారు. ప్రభుత్వంగూడ ఆ కమిటీని వేయడంలో జాప్యంచేసింది. వీళ్ళందరి ఆలోచనా ఒకటే. ఇప్పటికే దత్తాసామంత్ ఇంజనీరింగ్ పరిశ్రమలో బలంగాతయారయ్యాడు. బట్టలమిల్లులలో

గూడ అతనుగెలిస్తే ఇక ఆపేవారుండరు. ఆధునిక పారిశ్రామిక కార్మికులనుండి హమాలీలవరకు బొంబాయి నగరశ్రామికలోకం అంతటికీ సామంత్ చక్రవర్తి అవుతాడు.

వాళ్ళఅనుమానాలు సామంత్‌కు లాభదాయకమయ్యాయి. కమిటీవేసి కార్మికులకు ఏ 100 రూపాయలో వేతనం పెంచితే సామంత్ బహుశా సమ్మెవిరమించుకునే వాడేమోగాని, అట్లా జరగకపోయేసరికి గత్యంతరంలేక అతను మళ్ళీ కార్మికులకు సమ్మెకు సిద్ధంకమ్మని పిలుపిచ్చాడు. జనవరి 6న ఒకరోజు మొత్తం మిల్లులన్నీ మూతపడ్డాయి. జనవరి 18 నుండి నిరవధికంగా అన్నిమిల్లులలోనూ సమ్మె మొదలయింది. ఈ సంవత్సరం జనవరి 18కి దానికి ఒకసంవత్సరం నిండుతుంది. ఈ సమ్మెనుగురించి అందరు పరిశీలకులూ చెపుతున్నమాటలు రెండున్నాయి. ఒకటి, కార్మికులు బోనస్‌కంటే, జీతానికంటే, RMMS ను 'గుర్తింపు' స్థానం నుండి తొలగించడానికీ, BIR చట్టాన్ని ఎత్తివేయించడానికీ, ఎక్కువప్రాధాన్యత నివ్వడం. అంటే సమ్మెను ఆర్థికంగాకాకుండ రాజకీయంగా కార్మికులే పరిగణించడం. రెండవది కార్మికులలోని అపూర్వమయిన పోరాటఉత్సాహం, పట్టుదల. ఏ బహిరంగసభకూ ఇంతవరకు 50వేలనుండి 1 లక్షకు తక్కువమంది హాజరయినట్టు లేదు. కార్మికనాయకులు పోలీసులతో తలపడవద్దనీ దుస్సాహసాలు చేయవద్దనీ వారిస్తున్నా వినక పోలీసులతో ముఖాముఖీ పోరాటానికి కార్మికులుదిగిన సంఘటనలుచాలా ఉన్నాయి. జూలై 4న వర్లీలో 1000 మంది కార్మికులు పోలీసులతో వీధిలోనే తలపడి మూడుగంటలసేపు ట్రాఫిక్‌ను నిలిపేసారు. సమ్మెజరుగుతున్న ఫ్యాక్టరీలలోకి RMMS ప్రోత్సాహంతో విచ్ఛిన్నకారులు (black-legs) పనిలోకివెళితే వాళ్ళను సురక్షితంగా ఇంటికిచేర్చేబాధ్యత మీదవేసుకోవడానికి పోలీసులుసహితం భయపడుతున్నారు. వాళ్ళను సమ్మెచేస్తున్న కార్మికుల కోపంనుండి కార్మికనాయకులే రక్షించాల్సి వస్తోంది. కార్మికుల పట్టుదలగూడ అపూర్వమయినది. కడుపుమాడేసరికి ఉత్సాహంచచ్చి పనిలోకి పోవడంలేదు, ఏదోఒక పనిచేసుకొని పొట్టపోసుకుంటున్నారు. హమాలీలుగా, టాక్సీడ్రైవర్లుగా, పోర్టర్లుగా, కూలీలుగా, పనిచేస్తున్నారు. కొందరు కూరగాయలు అమ్ముకుంటున్నారు. కొందరు బూట్లకుపాలిష్‌చేసి రోజుకు రెండూమూడూ సంపాదించుకుంటున్నారు. సమ్మెలోభాగంగా దత్తాసామంత్ 'జెయిల్ భరో' (జెయిళ్లనింపండి) అనేనినాదం ఇచ్చినప్పుడు 10 వేలమంది కార్మికులు అసలే తిండిలేని తమకుటుంబాలను వదిలిపెట్టి రెండువారాలు జెయిలుకువెళ్ళారు.

ఈ మిలిటెన్సీ ఆగస్టు 18-20ల మధ్య పరాకాష్ఠనందుకుంది. ఆగస్టు 18న బొంబాయినగరంలోని పోలీసులు సమ్మెచేసారు. తమ యూనియన్ నాయకులను అరెస్టుచేసినందుకు నిరసనగా జరిగిన ఈ సమ్మెమీదికి ప్రభుత్వం సైన్యాన్నిదించడంతో పరిస్థితి అల్లకల్లోలమయింది. రెండురోజులపాటు నగరంలో అంతర్యుద్ధ వాతావరణం నెలకొనింది. ఆకల్లోలంలో, అంతవరకు శాంతంగావుండిన బట్టల మిల్లుల కార్మికులు ప్రత్యక్షచర్యలకు ఒడిగట్టారు. RMMS అధ్యక్షుడు హోషింగ్ను కార్యదర్శి భోస్లేని, అంతులేప్రభుత్వం నియమించిన కమిటీలో సభ్యుడయిన భాపు రావు పాటిల్ను, టార్గెట్లుగా తీసుకొని వారిఇళ్ళమీదికి దాడులుజరిపారు. వాళ్ళ భార్యాపిల్లలను పక్కకుతొలగమని వారించి ఇళ్ళను పద్ధతిప్రకారం ధ్వంసంచేసారు. హోషింగ్ఇంటిని కాలబెట్టడానికికూడ ప్రయత్నించారు. రెండురోజులపాటు నగరంలో కొన్నిప్రాంతాలలో దుకాణాలను లూటీచేసారు. జీతాలుపెరగడంవల్ల పారిశ్రామిక కార్మికులలో పోరాటచైతన్యం నశించిందన్న అబద్ధాన్ని బట్టబయలుచేసారు.

కార్మికులిట్లాగుంటే అసలు దత్తాసామంత్కు, ఇతర బూర్జువా రాజకీయ నాయకులకు, ఈ పోరాటం తమరాజకీయ మనుగడను తేల్చేవిషయంగా తయారయింది. బట్టలమిల్లు కార్మికులపట్ల కాంగ్రెస్ప్రభుత్వపు నిర్లక్ష్యవైఖరిని తమ ప్రయోజనాలకోసం వాడుకోవాలని ప్రతిపక్షనాయకులు ప్రయత్నిస్తే, కాంగ్రెస్ రాజకీయ నాయకులకు తమనెత్తికే ఇది దెబ్బఅన్న భయంపట్టుకుంది. 'RMMS నాయకుల పాపాలకు మేమంతా ఎందుకుపరిహారం చెల్లించాలి?' అని వాళ్ళప్రశ్న. బొంబాయి కార్పొరేషన్కుచెందిన 70 మంది మునిసిపల్ కార్పొరేటర్లు సమ్మె విషయమై ముఖ్యమంత్రి తమతోమాట్లాడాలని డిమాండ్చేస్తూ అసెంబ్లీలో ఒకనాడు ఘెరాయించారంటే ఆభయం ఎంతతీవ్రమయినదో ఊహించవచ్చు. ప్రతిపక్షకార్మిక నాయకులుగూడ, వెనకబడ్డవాడు పాపాత్ముడన్నట్టు తలమార్చారు. శివసేననాయకుడు బాల్థేకరేనుండి, ఉత్తరప్రదేశ్లో రైతునాయకుడిగా, తెలంగాణకొస్తే విప్లవాభిమానిగా, బొంబాయివెళితే కార్మికనాయకుడిగా, అవతారాలెత్తే జార్జిఫెర్నాండెస్ వరకు, అందరూ దత్తాసామంత్కు సమ్మెఎట్లానడపాలో సలహాలిచ్చినవాళ్లే, కార్మికుల తరపున అయాచితంగా వకాల్తాపుచ్చుకొని ప్రభుత్వంతోమాట్లాడి పరిష్కార 'ఫార్ములాలు' మోసుకొచ్చినవాళ్లే. 37 ఏళ్ళుగా తాముసాధించలేకపోయినది సామంత్ ఎక్కడ సాధిస్తాడోనన్నభయం, ఒకవేళసాధిస్తే ఆ ఘనతలో పదోవంతయినా తాము దక్కించుకోలేక పోతామాఅన్నఆశ, వాళ్ళను కదిలిస్తున్నాయి. దత్తాసామంత్నుగూడ

వాస్తవానికి కార్మికుల పోరాటనెల్లావే మోసుకపోతోంది. "సమ్మెకొనసాగిస్తున్న ఘనత 95శాతం కార్మికులకే దక్కుతుంది, 5 శాతం మాత్రమేనాది" అని అతనే అన్నాడు. బూర్జువాపాత్రికేయుల పరిభాషలో సామంత్ రాజకీయాలకు అతీతుడు. అంటే కార్మిక పోరాటాలను కేవలం ఆర్థికపోరాటాలుగా నడిపేదృక్పథం అతనిది, మాటమాత్రంగా నయినా సోషలిజాన్నిగురించి మాట్లాడడు. 1972లో కార్మికరంగంలో ప్రవేశించి ఇంజనీరింగ్ పరిశ్రమలోబలపడి ఇప్పుడు క్రమంగా ఇతరరంగాలకు విస్తరిస్తున్నాడు. సామంత్ విజయానికి ప్రధానకారణం, లీగలిస్టుపద్ధతులకు. పరిష్కార యంత్రాంగాలకు, సంక్లిష్టమయిన చర్చలకు, తావివ్వకుండ ప్రత్యక్షచర్యలకు పూనుకోవడం. దీనివల్ల కార్మికుల చొరవకు ప్రముఖస్థానం ఇవ్వడంజరుగుతుంది. చిన్నవిషయాలమీద, పాక్షిక ప్రయోజనాలకోసం, సమ్మెలు జరపకుండ ఒకేసారి పెద్దడిమాండ్లు తీసుకోవడం, దీర్ఘకాలిక సమ్మెలు చేపట్టడం, అతనికి కార్మిక రంగంలో సినీహీరో గ్లామర్ సంపాదించి పెట్టడానికి ఉపయోగపడ్డాయి. ఉదాహరణకు ఈ సమ్మెలో అతని డిమాండు, వేతనాలలో 250-400 రూపాయల పెరుగుదలరావాలని, రివిజనిస్టు కార్మిక నాయకులలాగా తన కళ్ళకు (లేదా మాస్కో కళ్ళకు) అభ్యుదయకారులుగా కనిపించిన వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు వెనకడుగు వేయడం, మళ్లీ ముందడుగు వేయడం, ఇట్లాంటివి ఉండవు కాబట్టి కార్మికుల విశ్వాసాన్ని సులభంగా సంపాదించుకోగలిగాడు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు గూడ ఇతర INTUC నాయకులలాగా ప్రవర్తించలేదు. కార్మికులపై తన ఆధిపత్యం శాశ్వతంగా నెలకొనడం తప్ప అతనికి వేరే లక్ష్యంలేదు, వేరే సిద్ధాంతమూ లేదు, నీతి నియమాలులేవు. కార్మిక ఉద్యమంలో గుండాయిజానికి శివసేన తరవాత దత్తాసామంత్‌నే చెప్పుకోవాలి. గుండాయిజం మాత్రమే కాదు, శివసేన ఏపద్ధతులద్వారానయితే బొంబాయి నగరంలోని వెనకబడ్డ మహారాష్ట్రులలో ప్రభావం సంపాదించుకుందో, ఆ పద్ధతులన్నింటినీ శివసేనమీదే తాను ప్రయోగించాడు. అతని కార్మికసంఘం (మహారాష్ట్ర గిర్నీ కాంగార్ యూనియన్) ఊరేగింపులలో 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి !' అనే కమ్యూనిస్టుల నినాదం సరసనే 'ఛత్రపతి శివాజీకీజై !' అనే శివసేన నినాదం ఉంటుందట. 'సీనాహైతో మత్ నాసీఖో, కదం కదంపర్ లడ్‌నాసీఖో' అనే పోరాట నినాదం ఇస్తూనే, ఒక ట్రక్కులో శివాజీ దర్బారుకు నకల్ తయారుచేసి శివాజీవిగ్రహాన్ని నిలబెట్టి దానికి పూలమాలలువేసి ఊరేగింపుతో తీసుకపోయారట. ఇదంతా మహారాష్ట్ర కార్మికుల జాతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుందని సంతోషించిన వారు లేకపోలేదు. కాని శివాజీ కేవలం మహారాష్ట్ర జాతీయ చరిత్రలో ఒక ప్రముఖ

వ్యక్తిమాత్రమేకాదు, శివసేన పుట్టిన తరువాత కూడా మహారాష్ట్ర జాతీయ సంకుచితత్వానికీ, ముస్లింవ్యతిరేకతకూ గూడ చిహ్నం.

సమ్మె భవిష్యత్తు గురించి చెప్పటం కష్టం. నిజానికి మొదట్లో మిల్లు యజమాన్లకు సమ్మె అంత అత్యంతబాధాకరంగా కనిపించలేదు. గోడౌన్లలో పేరుకుపోయిన సరుకుల నిల్వను వదిలించుకోవటానికి సమ్మెలు ఉపయోగపడతాయి. పనిలో పనిగా ధరగూడ పెంచవచ్చు మరొక కారణం వత్తిడి. గత రెండేళ్ళలో, మహారాష్ట్రలోని పత్తిపండించే రైతులు రాజకీయంగా బలపడటంవల్ల పత్తిధర ఒక్కసారిగా 30 నుండి 50 శాతం వరకు పెరిగింది. సమ్మెజరిగి మిల్లులు మూతపడితే గిరాకీ తగ్గి పత్తిధర పడిపోతుంది. సమ్మె ఇంకా మొదలు కాకముందే, సమ్మె జరగగల దన్న వార్తవల్ల పత్తిధర 10-15 శాతం పడిపోయిందని EPW లో రాష్ట్ర అమృతా అబ్రహాం 1981 డిసెంబరులోనే అన్నారు. కాబట్టి మొత్తంమీద సమ్మెవల్ల మిల్లు యజమాన్లకు తొలిరోజులలో లాభాలు లేకపోలేదు. అయినా లాభాలు - అంతిమంగా నిల్వలనుండీ మోసకం నుండీకాక అదనపు విలువ నుండి వస్తాయి కాబట్టి, అంటే కార్మికులు శ్రమచేస్తేనే యజమాన్లకు లాభాలు వస్తాయి కాబట్టి, మిల్లులు తెరవాలనే యజమాన్లకు ఉంటుంది. కాని దత్తాసామంత్ విజయం సాధించటం ద్వారా మాత్రం కాదు, మిల్లుయజమాన్లకూ, కాంగ్రెస్‌నేతలకూ, RMMS నాయకులకూ, అందరికీ కావలసింది అదే: మిల్లులు తెరవాలి, కాని దత్తాసామంత్‌ను నాశనం చేసిన తరువాతే. మిల్లు యజమాన్లకొక దీర్ఘకాలిక పథకం గూడవుంది. కార్మికులు పూర్తిగా బలహీనపడి, ఓడిపోయి తిరిగి పనిలోకివస్తే, చాలాకాలంగా వాయిదాపడివున్న ఆధునికీకరణను ప్రవేశపెట్టి సగంమందిపైగా కార్మికులను ఖర్చు లేకుండా పనిలోనుండితీసేసి ఇక శాశ్వతంగా కార్మికులు బెదరకుండా చేసుకోవచ్చు.

నిజానికి దత్తాసామంత్ కార్మికరంగంలో శాశ్వతంగా నిలవగలవ్యక్తి కాదు. కార్మికవర్గ దృక్పథం లేకపోవటమే కాదు, అతని యూనియన్లకు ఒకనిర్మాణంగాని, ఎదురుదెబ్బకు తట్టుకొని నిలబడగల పనిపద్ధతిగాని లేవు. అతను ఆధారపడేది కేడర్ మీదకాదు, తనగ్లామర్ మీద, కిరాయి గూండాలమీద. ఈ సమ్మెతో కాకుంటే ఒకనాడు దత్తాసామంత్‌కు బొంబాయి కార్మికరంగంనుండి నిష్క్రమించక తప్పదు. అయితే అతను బొంబాయికార్మికులకు వదిలివెళ్లే సందేశం ఒకటివుంటుంది. అది, లీగల్ పద్ధతులనూ లేబర్ ట్రిబ్యునళ్ళనూ నమ్ముకోక ప్రత్యక్షపోరాటాలపై ఆధారపడి ముందుకుపోవటం. ఆ సందేశాన్ని అందుకోగలిగితే బొంబాయి కార్మికులలో కస్తుందని ఆశిద్దాం.

* సృజన, ఫిబ్రవరి 1983